# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి: 18 సంచిక: 139 | మంగళవారం, 01 ఏప్రిల్ 2025 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com



MHR TV
www.MHRtv.com


## హెచ్‌సీయూ భూములు అమ్మడానికి ప్రభుత్వానికి ఎందుకంత ఆరాటం

సెంట్రల్ యూనివర్సిటీ వల్ల ఆ ప్రాంతం చాలా అభివృద్ధి చెందింది

2003 ప్రాంతంలో ఐఎమ్ జీకి అప్పటి ప్రభుత్వం ల్యాండ్ కేటాయించింది

కానీ మీరు ఇప్పుడు వేలం పెట్టి ఎవరికి ఇవ్వాలి అనుకుంటున్నారు : కేటీఆర్



**హైదరాబాద్ మార్చి 31(ప్రజాస్వరం):**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వివాదం రాజకీయ మలుపు తీసుకుంటోంది. ఈ అంశంపై విద్యార్థుల ఆందోళనలతో పాటు రాజకీయ నాయకుల ప్రస్తావనలు పెరుగుతున్నాయి. తాజాగా, తెలంగాణ భవన్‌లో హెచ్‌సీయూ విద్యార్థులతో మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) భేటీ అయ్యారు. ఈ సమావేశంలో విద్యార్థులు తమ ఆందోళనలను వ్యక్తం చేయగా, కేటీఆర్ ప్రభుత్వ వైఖరిపై విమర్శలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, "హెచ్‌సీయూ భూములు అమ్మడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు అంత ఆరాటపడుతుంది?" అని ప్రశ్నించారు. ఆయన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ, "సెంట్రల్ యూనివర్సిటీ వల్ల ఆ ప్రాంతం అభివృద్ధి చెందింది. కానీ, ఇప్పుడు ప్రభుత్వం వేలం వేయాలని చూస్తోంది" అని పేర్కొన్నారు. 2003లో అప్పటి

మిగతా 2వ పేజీలో

### ఏప్రిల్ 2న లోక్‌సభ ముందుకు వక్ఫ్ బిల్లు..




02

### త్వరలోనే మోడీ రిటైర్‌మెంట్

నాయకత్వ మార్పు తప్పదు

ఆర్ఎస్ఎస్ ఆలోచనా ఇదే

మోడీ ఆర్ఎస్ఎస్ కార్యాలయ సందర్శనపై సంజయ్ రౌత్



### రెచ్చగొట్టే ప్రయత్నం చేసినా.. ఓపికతో ఉండాలి..

పదేండ్లలో మైనారిటీల అభ్యున్నతికి కృషి చేశాం

రంజాన్ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి హరీష్ రావు


02

### విద్యార్థులపై లాఠీచార్జ్ దారుణం

400 ఎకరాలు అమ్మి రాష్ట్రాన్ని పాలిస్తారా?

విద్యార్థులను మానవత్వం లేకుండా లాక్కెళుతున్నారు

ఏబీవీపీ కార్యకర్తలను చితకబాదారు

కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై బండి సంజయ్ మండిపాటు


02

### బీసీ రిజర్వేషన్లకు మద్దతుగా ఢిల్లీలో మహాధర్నా

ఢిల్లీకి మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, బీసీ ఎమ్మెల్యేలు

బీసీ రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు కోరనున్న కాంగ్రెస్ బృందం


02

### పొలిటికల్ టర్న్ తీసుకుంటున్న భూ వివాదం హెచ్‌సీయూ

భూముల విషయంలో స్పందించిన హెచ్‌సీయూ

TGIIC ఇచ్చిన స్టేట్‌మెంట్ తప్పు..

ఇప్పటి వరకు ఎలాంటి సర్వే జరగలేదు

డి మార్కేషన్ జరగలేదు :హెచ్‌సీయూ

02

### కాంగ్రెస్ పార్టీని తరిమికొట్టే రోజులు దగ్గర పడ్డాయి..

సీఎం అనే సోయిలేకుండా దిగజారుడు వ్యాఖ్యలు

ఆయన భాష తీరే ఆయనను బొందపెడుతుంది

రేవంత్ రెడ్డి దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారు

ఆరు గ్యారంటీలు నమ్మి ప్రజలు మోసపోయారు

కాంగ్రెస్ పాలనలో రైతులకు తప్పని కష్టాలు

కాంగ్రెస్ పార్టీ పాలనపై మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి విమర్శలు


02

### యువతకు మంచి అవకాశం

యువతకు స్వయం ఉపాధి కల్పించాలని లక్ష్యంతో రాజీవ్ యువ వికాసం

రూ.50 వేల నుండి రూ.4 లక్షల వరకు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం

గడిచిన 10 సంవత్సరాల తర్వాత యువతకు ఒక మంచి అవకాశాన్ని కల్పిస్తున్నాం: శ్రీధర్‌బాబు


02



### స్థానిక సంస్థలు బలపడాలంటే బీజేపీ గెలవాలి

తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయంపై కిషన్ రెడ్డి స్పందన

బీజేపీ ఆఫీస్ బేరర్స్ మీటింగ్

కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యాలు

02

# విద్యార్థులపై లాఠీచార్జ్ దారుణం

- 400 ఎకరాలు అమ్మి రాష్ట్రాన్ని పాలిస్తారా?
- విద్యార్థులను మానవత్వం లేకుండా లాక్కెళుతున్నారు
- ఏబీవీపీ కార్యకర్తలను చితకబాదారు
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై బండి సంజయ్ మండిపాటు



**హైదరాబాద్ మార్చి 30(ప్రజాస్వరం):**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థుల ఆందోళనపై కేంద్రమంత్రి బండి సంజయ్ స్పందించారు. విద్యార్థులపై చర్యలను ఖండించారు. స్టూడెంట్స్‌పై లాఠీచార్జ్ చేయడం దారుణమన్నారు. సోమవారం మీడియాతో కేంద్రమంత్రి మాట్లాడుతూ.. హెచ్‌సీయూ భూములకు సంబంధించి మీడియాలో వచ్చిన దృశ్యాలను చూసి తెలంగాణ సమాజంలో బాధపడని వ్యక్తి లేడన్నారు. విద్యార్థులను మానవత్వం లేకుండా లాక్కెళ్తుండటం దారుణమన్నారు. హెచ్‌సీయూలో ఒక భయానక వాతావరణాన్ని సృష్టించారని.. అమ్మాయిలను ఈడ్చుకెళ్తున్న వీడియోలు చూస్తే బాధేస్తోందన్నారు. భూములను ఎలా అమ్ముకుంటారని ప్రశ్నిస్తే ఇంతకు తెగిస్తారా అంటూ మండిపడ్డారు. దొంగల్లా రాత్రి పూట ఏబీవీపీలతో వదుసు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ అధికారంతో హెచ్‌సీయూకు వెళ్తున్నారని ప్రశ్నించారు. యూనివర్సిటీ భూములను అమ్మొద్దంటే విద్యార్థులను అడ్డుకుని అరెస్ట్ చేయడం దారుణమన్నారు. ఆ వీడియోలను చూసి ప్రతీఒక్కరూ చలించిపోయారన్నారు. యూనివర్సిటీలోని 400 ఎకరాలు అమ్మి రాష్ట్రాన్ని పాలిస్తారా అంటూ వ్యాఖ్యలు చేశారు. హెచ్‌సీయూ భూములను అమ్మకపోతే తెలంగాణ రాష్ట్రాన్ని పాలించే స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం లేదని విమర్శించారు. ఈనెల గడవాలంటే హెచ్‌సీయూ భూములను అమ్మాలనే ధోరణిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. రాబోయే తరాలకు గజం జాగ కూడా ఉండే పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం లేదన్నారు. రాష్ట్రంలోని అన్ని భూములను అమ్మేస్తారని వ్యాఖ్యలు చేశారు. ఏబీవీపీ కార్యకర్తలను అరెస్ట్ చేయడమే కాకుండా పోలీస్‌స్టేషన్‌లో వారిని చితకబాదారన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ కంటే కాంగ్రెస్ పార్టీ అరాచకం అధికమన్నారు. వెంటనే హెచ్‌సీయూ భూముల అమ్మకాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై లాఠీచార్జ్ చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలన్నారు. హెచ్‌సీయూ భూములను అమ్ముతుంటే విద్యా కమిషన్ చైర్మన్, మెంబర్లు ఎందుకు స్పందించరని ప్రశ్నించారు. వీరంతా కూడా హెచ్‌సీయూ భూముల అమ్మకాన్ని సమర్థిస్తున్నట్లే అని అన్నారు. విద్యార్థుల ఆందోళనలకు బీజేపీ పూర్తి మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. భూములు అమ్మి రాష్ట్రాన్ని పాలించడం ఏంటి.. కేసీఆర్ రాష్ట్రం ఇచ్చినా భూములమ్మి పాలిస్తారని అన్నారు. భూములమ్మి రాష్ట్రాన్ని పాలించే ప్రభుత్వం ప్రజలకు అవసరం లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు.

# రెచ్చగొట్టే ప్రయత్నం చేసినా.. ఓపికతో ఉండాలి..

- పదేండ్లలో మైనారిటీల అభ్యున్నతికి కృషి చేశాం
- రంజాన్ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి హరీష్ రావు

**హైదరాబాద్ మార్చి 30(ప్రజాస్వరం):**

దేశంలో అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందేలా ప్రభుత్వాల సమష్టిగా పని చేయాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. కేసీఆర్ గత పదేండ్లలో హిందువుల అభ్యున్నతి కోసం ఏవిధంగా పాటుపడ్డారో.. అలాగే మైనారిటీల అభ్యున్నతి కోసం కూడా అంతే పాటుపడ్డారని తెలిపారు. సిద్దిపేటలో నిర్వహించిన రంజాన్ వేడుకల్లో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. రంజాన్ పండుగను హిందూ, ముస్లిం అనే భేదాభిప్రాయాలు లేకుండా చేసుకోవాలని సూచించారు. నిన్న ఉగాది పండుగ రోజు ముస్లింలు హిందువుల ఇండ్లలోకి వచ్చి బక్షాలు తిని.. ఉగాది శుభాకాంక్షలు తెలిపారని అన్నారు. ఈరోజు రంజాన్ పండుగ సందర్భంగా హిందువులు ముస్లిం సోదరులను అలయ్ బలాయ్ చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్నారని పేర్కొన్నారు. ఎన్నో ఏండ్ల నుంచి మన దేశం, రాష్ట్రం మతాల కతీతంగా సోదర భావంతో ఒకరి పండుగల్ని ఒకరు.. ఒకరి సంప్రదాయాన్ని మరొకరు గౌరవిస్తూ ఎంతో సఖ్యతతో జీవిస్తున్నారని తెలిపారు. కొన్ని శక్తులు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నప్పటికీ అందరూ ఓపికతో, శాంతితో, సౌభాగ్యంతో కలిసి మెలసి ఈ దేశ, రాష్ట్ర అభివృద్ధి కోసం సోదర భావంతో అందరం కలిసి కృషిచేయాలని కోరారు.

# స్థానిక సంస్థలు బలపడాలంటే బీజేపీ గెలవాలి

- తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయంపై కిషన్ రెడ్డి స్పందన
- బీజేపీ ఆఫీస్ బేరర్స్ మీటింగ్
- కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యాలు

**హైదరాబాద్ మార్చి 30(ప్రజాస్వరం):**

కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి కుట్రలు చేసినా తెలంగాణలో ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాలను గెలుచుకున్నామని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ప్రచారం చేసినప్పటికీ, ఓటర్లు బీజేపీకి మద్దతు తెలిపారని ఆయన వ్యాఖ్యానించారు. నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన బీజేపీ ఆఫీస్ బేరర్స్ మీటింగ్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ సహా ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ, "స్థానిక సంస్థలు బలపడాలంటే బీజేపీ గెలవాలి" అనే నినాదంతో బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతుందని తెలిపారు కిషన్ రెడ్డి.

కేంద్రం ఇచ్చే నిధులు తప్ప గ్రామ పంచాయితీలకు కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఏమాత్రం చేయలేకపోయాయని కిషన్ రెడ్డి ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హామీలు ఇచ్చి నెరవేర్చలేదని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కూడా ఇచ్చిన హామీలను నెరవేర్చలేక చేతులెత్తేసిందని ఆయన మండిపడ్డారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ రాకుండా ఈ రెండు పార్టీలపై పోరాటం చేయాలని ఆయన బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీజేపీ బలపడాలని, రాష్ట్ర సమస్యలపై పోరాడాలని, అధికారంలోకి రావాలని ప్రజలు చూస్తున్నారు అని కిషన్ రెడ్డి అన్నారు.

# పొలిటికల్ టర్న్ తీసుకుంటున్న హెచ్‌సీయూ భూ వివాదం

- భూముల విషయంలో స్పందించిన హెచ్ సీయూ
- టీజిఐఐసి ఇచ్చిన స్టేట్‌మెంట్ తప్పు.. ఇప్పటి వరకు ఎలాంటి సర్వే జరగలేదు
- డి మార్కేషన్ జరగలేదు :హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ

**హైదరాబాద్ మార్చి 30(ప్రజాస్వరం):**



హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్ సీయూ) భూముల వివాదం ఇప్పుడు కొత్త మలుపు తీసుకుంటోంది. ఈ వ్యవహారంపై విశ్వవిద్యాలయం తాజాగా విడుదల చేసిన ప్రకటనలో, తెలంగాణ ప్రభుత్వ సంస్థ అయిన టీజిఐఐసి ఇచ్చిన ప్రకటనను ఖండించింది. హెచ్ సీయూ తెలిపిన ప్రకారం, 400 ఎకరాల భూమిని గుర్తించేందుకు రెవెన్యూ అధికారులు ఇప్పటి వరకు ఎటువంటి సర్వే నిర్వహించలేదని వెల్లడించింది. జూలై 2024లో విశ్వవిద్యాలయ ప్రాంగణంలో సర్వే జరిగిందన్న వార్తలను హెచ్ సీయూ ఖండించింది. విశ్వవిద్యాలయం ప్రకటనలో, ఇప్పటివరకు భూమి స్థలాకృతిపై ప్రాథమిక తనిఖీ మాత్రమే జరిగిందని స్పష్టం చేసింది.

టీజిఐఐసి ఇటీవల హెచ్ సీయూ భూమి సరిహద్దులు నిర్ణయించబడ్డాయి అని ప్రకటించగా, హెచ్ సీయూ మాత్రం దీనిని ఖండించింది. తమ భూసరిహద్దులు ఇప్పటివరకు అధికారికంగా గుర్తించలేదని, విశ్వవిద్యాలయానికి ఎటువంటి అధికారిక సమాచారం అందించలేదని హెచ్ సీయూ ప్రకటించింది.

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఈ సమస్యపై రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ, విశ్వవిద్యాలయానికి కేటాయించిన భూమిని ఎటువంటి అన్యాక్రాంతాలకు గురిచేయకుండా చూడాలని కోరింది. హెచ్ సీయూ ప్రకారం, ఈ భూమి ట్రాన్స్‌ఫర్ కావాలంటే, అది పూర్తిగా విశ్వవిద్యాలయ కార్యనిర్వాహక మండలి ఆమోదంతో మాత్రమే జరగాలి. హెచ్ సీయూ ఈ వివాదాన్ని పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ కోణంలో కూడా పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరింది.

## హెచ్‌సీయూ భూములు అమ్మడానికి
# ప్రభుత్వానికి ఎందుకంత ఆరాటం

మొదటిపేజి తరువాయి

ప్రభుత్వం ఐఎమ్ జీ అనే సంస్థకు ల్యాండ్ కేటాయించిందని కేటీఆర్ గుర్తు చేశారు.

స్పోర్ట్స్ సిటీ అభివృద్ధి కోసం అప్పట్లో భూమి ఇచ్చారని, కానీ ఇప్పుడు వేలం వేయాలనుకోవడం సరైన విధానం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. "ఫ్యూచర్ సిటీ కోసం 45 వేల ఎకరాలను అమ్ముతామని చెబుతున్నారు, మరి ఈ 400 ఎకరాలను వదిలేస్తే ఏమవుతుంది?" అని ప్రశ్నించారు.

కేటీఆర్ రాహుల్ గాంధీ వైఖరిపై కూడా విమర్శలు చేశారు. గతంలో రెండు సార్లు రాహుల్ గాంధీ హెచ్ సీయూకి వచ్చారని, కానీ ఇప్పుడు మాత్రం ఈ అంశంపై పట్టించుకోవడం లేదని వ్యాఖ్యానించారు. "ఇతర రాష్ట్రాల్లో పర్యావరణంపై మాట్లాడే రాహుల్ గాంధీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల గురించి ఎందుకు మౌనంగా ఉన్నారు?" అని ప్రశ్నించారు. కేటీఆర్ మాట్లాడుతూ, "ఎన్నికల అనంతరం రాహుల్ గాంధీ హెచ్ సీయూకి వచ్చి విద్యార్థులతో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. కానీ ఇప్పుడు వారిని ఫుట్‌బాల్‌లా తిప్పుతున్నారు" అని ఆరోపించారు. విద్యార్థులు తమను హెచ్ సీయూకి రావాలని కోరుతున్నారని, కానీ తాము అక్కడికి వెళ్లితే సీఎం రేవంత్ రెడ్డి 'రాజకీయాలు చేస్తున్నారు' అంటూ విమర్శిస్తారని కేటీఆర్ తెలిపారు.

ఈ భూ వివాదంపై తాము హైకోర్టులో పిటిషన్ వేస్తామని, పార్లమెంట్‌లో కూడా పోరాడుతామని కేటీఆర్ స్పష్టం చేశారు. "విద్యార్థుల భవిష్యత్తుకు తాము అండగా ఉంటామని, ఈ సమస్యకు న్యాయపరమైన , రాజకీయపరమైన పరిష్కారం కోరుతామని" అన్నారు. మొత్తంగా, హెచ్ సీయూ భూ వివాదం రాష్ట్ర రాజకీయాలలో ప్రధాన చర్చనీయాంశంగా మారింది. విద్యార్థుల ఆందోళనలతో పాటు, ప్రభుత్వ వైఖరిపై ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నాయి.



# బీసీ రిజర్వేషన్లకు మద్దతుగా ఢిల్లీలో మహాధర్నా

- ఢిల్లీకి మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, బీసీ ఎమ్మెల్యేలు
- బీసీ రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు కోరనున్న కాంగ్రెస్ బృందం

**హైదరాబాద్ మార్చి 30(ప్రజాస్వరం):**

తెలంగాణలో బీసీల రిజర్వేషన్లు 42 శాతం పెంచుతూ శాసన సభ ఆమోదించిన బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని ఏప్రిల్ 2న ఢిల్లీలో బీసీ సంక్షేమ సంఘాలు మహాధర్నాకు పిలుపునిచ్చాయి. ఈ మహాధర్నాలో ఏఐసీసీ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఏఐసీసీ నేతలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఇతర మంత్రులు, బీసీ ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, వాకిటి శ్రీహరి, ఈర్లపల్లి శంకరయ్యలు పాల్గొని సంఘీభావం తెలియజేయనున్నారు. అన్ని రాజకీయ పార్టీల నేతలు, ప్రతిపక్ష పార్టీల ఎంపీలు కూడా ఇందులో పాల్గొననున్నారు.

తెలంగాణ శాసనసభలో ఇటీవల బీసీలకు రాజకీయ, విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని ఏప్రిల్ 2,3 తేదీల్లో కేంద్ర ప్రభుత్వ పెద్దలను, వివిధ పార్టీల నాయకులను కలిసి తెలంగాణ చేసిన కుల సర్వే వివరాలను వివరిస్తారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చేసిన చట్టానికి మద్దతు ఇవ్వాలని కోరనున్నారు. ఏప్రిల్ 2,3 తేదీల్లో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సహకారంతో వివిధ పార్టీ నేతలను కలిసి బీసీ రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు కోరనున్నట్లు తెలంగాణ కాంగ్రెస్ బృందం ప్రకటించింది. బీసీ సంక్షేమ సంఘాలతో కలిసి మహాధర్నా చేపట్టి, పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని స్పష్టం చేసింది.



## కాంగ్రెస్ పార్టీని తరిమికొట్టే
# రోజులు దగ్గర పడ్డాయి..

- సీఎం అనే సోయిలేకుండా దిగజారుడు వ్యాఖ్యలు
- ఆయన భాష తీరే ఆయనను బొందపెడుతుంది
- -రేవంత్ రెడ్డి దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారు
- -ఆరు గ్యారంటీలు నమ్మి ప్రజలు మోసపోయారు
- కాంగ్రెస్ పాలనలో రైతులకు తప్పని కష్టాలు
- -కాంగ్రెస్ పార్టీ పాలనపై మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి విమర్శలు



**హైదరాబాద్ మార్చి 31(ప్రజాస్వరం):**

సీఎం రేవంత్ రెడ్డ మాట తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి భాషలో ఎలాంటి మార్పు రాలేదని, ముఖ్యమంత్రి అనే సోయి లేకుండా దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన భాష తీరే ఆయన్ను బొందపెడుతుందని వ్యాఖ్యానించారు. అదే భాష, అవే పదాలు.. ముఖ్యమంత్రి స్థాయి వచ్చినా ఆయన మూర్ఖత్వం తగ్గడం లేదని ఎద్దేవా చేశారు. హుజూర్‌నగర్ సభలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. అవే పచ్చి అబద్ధాలు, అర్థం లేని ఆరోపణలతో పబ్బం గడుపుతున్నాడని విమర్శించారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా కేసీఆర్ మాట లేకుండా ఏ సభ సాగట్లేదని వ్యాఖ్యానించారు. సోనియా గాంధీ ఆరు గ్యారంటీలను నమ్మి ప్రజలు మోసపోయారు తప్ప.. రేవంత్ రెడ్డి మూర్ఖత్వపు మాటలకు కాదని స్పష్టం చేశారు.

కాళేశ్వరాన్ని కేసీఆర్‌కు అప్పగిస్తే మూడు రోజుల్లో నీళ్లు ఇచ్చి చూపిస్తామని చెప్పినా సీఎం రేవంత్ రెడ్డి నుంచి ఎలాంటి స్పందన లేదని జగదీశ్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పాలనలో మళ్లీ రైతులకు కష్టాలు మొదలయ్యాయని, పంట పొలాల వద్ద అన్నదాతలు కన్నీళ్లు పెడుతున్నారని అన్నారు. కడుపుమండిన రైతులు, మహిళలు ప్రభుత్వానికి, రేవంత్‌రెడ్డికి శాపనార్థాలు పెడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం ఇస్తామన్న రైతు రుణమాఫీ లేదు.. రైతుబంధు లేదు.. రైతు బీమా లేదు.. ప్రతీది మభ్యపెట్టి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బోనస్ ఇవ్వాల్సి వస్తుందని అసలు ధాన్యమే కొనడం లేదని అన్నారు. ఉన్న ధాన్యం ఎంత అంటే ఎక్కడా సమాధానం లేదని చెప్పారు. ప్రతిపక్ష నాయకుల ఫోన్లను అధికారులు ఎత్తడమే మానేశారని పేర్కొన్నారు. వానాకాలంలో ఏ పంట ఎంత కొన్నారని ప్రశ్నించారు. దొడ్డు రకానికి బోనస్ ఇస్తామని మాటమార్చి సన్నధాన్యానికే బోనస్ ఇస్తామని చెప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిన్న హుజూర్ నగర్‌లో నిర్వహించిన సభలో సీఎం రేవంత్ రెడ్డి అదే మూర్ఖత్వాన్ని, అజ్ఞానాన్ని ప్రదర్శించాడని జగదీశ్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్‌ను తిట్టడం తప్ప ఆయనకు వేరే పనే లేదని అన్నారు. కేసీఆర్‌పై విషం కక్కి ప్రజాస్వరం లో బతకడం సాధ్యం కాదని అన్నారు. ఇంకా మూడేళ్లు అధికారంలో ఉంటారని తెలిసి కూడా కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ప్రజలు భయపడకుండా ఎండగడుతున్నారని తెలిపారు. కేసీఆర్‌కు ఉరివేస్తానని రేవంత్ రెడ్డి అంటున్నారని.. ప్రజలే రేవంత్‌కు ఉరివేసే రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. ప్రజలు తిరగబడితే ఎలా కూలియాయో ఒకసారి పక్క దేశాలను చూస్తే తెలుస్తుందని హితవుపలికారు. సీఎం రేవంత్ రెడ్డి తన పద్ధతి, భాష మార్చుకోవాలని, రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని జగదీశ్ రెడ్డి సూచించారు. గత ఏడాది కొన్న సన్న వడ్లు ఎన్ని.. ఇచ్చిన బోనస్ ఎంతో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రబీ ధాన్యం కొనుగోలు చేసేందుకు ఇప్పటివరకు ఎలాంటి సమీక్షలు చేయలేదు.. అసలు కొనుగోలు చేస్తారా లేదా తెలియట్లేదని సందేహం వ్యక్తం చేశారు. నీళ్లు ఇవ్వమంటే రైతులు పొలాలు వేసుకోరని అన్నారు. నీళ్ళు ఇస్తామని నేడు ఇవ్వకపోవడంతో వేలాది ఎకరాలు నష్టపోయారని తెలిపారు. ఒక తడికి ఇస్తే వేలాది ఎకరాలు పెట్టుబడి అయినా వస్తుంది.. చివరి భూముల వరకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్లపై వెంటనే ఒక ప్రకటన చేయాలన్నారు.

# యువతకు మంచి అవకాశం

- యువతకు స్వయం ఉపాధి కల్పించాలని లక్ష్యంతో రాజీవ్ యువ వికాసం
- రూ.50 వేల నుండి రూ.4 లక్షల వరకు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం
- గడిచిన 10 సంవత్సరాల తర్వాత యువతకు ఒక మంచి అవకాశాన్ని కల్పిస్తున్నాం: శ్రీధర్‌బాబు

**హైదరాబాద్ మార్చి 30(ప్రజాస్వరం):**

రాజీవ్ యువ వికాసం పథకంపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తో కలిసి రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సాంఘిక సంక్షేమ, మైనార్టీల, వెనుకబడిన తరగతుల, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల అభివృద్ధి కొరకు రాజీవ్ యువ వికాసం కార్యక్రమాన్ని, రాష్ట్రంలో ఉన్న యువతకు స్వయం ఉపాధి కల్పించాలని లక్ష్యంతో రాజీవ్ యువ వికాసం ద్వారా రూ.50 వేల నుండి రూ.4 లక్షల వరకు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయమని ఆయన పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆయన తెలిపారు. గడిచిన 10 సంవత్సరాల తర్వాత యువతకు ఒక మంచి అవకాశాన్ని కల్పిస్తున్నామని, ఈ కార్యక్రమంలో అన్నికులాల వారికి అవకాశమని ఆయన మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. గ్రామీణ ప్రాంతంలో రూ.లక్ష 50వేల ఆదాయం, పట్టణ ప్రాంతాల్లో రెండు లక్షల ఆదాయం ఉన్నవారికి ఈ పథకం వర్తింపు అని, నిరుద్యోగ, నిరుపేద యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి వారి జీవనశైలి మెరుగుపరిచేందుకు వారదర్శకంగా ఈ కార్యక్రమం చేపడుతున్నామని ఆయన వ్యాఖ్యానించారు. ఇచ్చిన నిధులు వాటికే ఖర్చు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని, మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని, జిల్లా పాలనయంత్రాంగం దీనికి సహకరించాలన్నారు మంత్రి శ్రీధర్‌బాబు.

# ఏప్రిల్ 02న లోక్‌సభ ముందుకు వక్ఫ్ బిల్లు..

**నేషనల్ బ్యూరో, మార్చి 31(ప్రజాస్వరం):**

బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న వక్ఫ్ బిల్లు ఏప్రిల్ 02న లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. ఆగస్టు 2024లో జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపబడిన ఈ బిల్లు, లోక్‌సభ ముందుకు రాబోతోంది. ఈ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందు బీజేపీ సీనియర్ మంత్రులు ఇండియా కూటమి నేతలతో చర్చలు జరపనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ బిల్లు తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. ఈ బిల్లు ద్వారా ముస్లింల హక్కుల్ని హరిస్తున్నారంటూ ఆ వర్గానికి చెందిన నేతలు ఆరోపిస్తున్నారు. అయితే, ఇన్నాళ్లు వక్ఫ్ బోర్డుల ఇష్టారాజ్యానికి, అపరిమిత అధికారాలకు ఈ బిల్లు ద్వారా అడ్డుకట్ట వేస్తామని బీజేపీ చెబుతోంది. ప్రస్తుతం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 04తో ముగియనున్నాయి. అయితే, ఈ బిల్లు చట్టంగా మారాలంటే లోక్‌సభ, రాజ్యసభ రెండూ ఆమోదించాలి.

# త్వరలోనే మోడీ రిటైర్‌మెంట్

- నాయకత్వ మార్పు తప్పదు
- ఆర్ఎస్ఎస్ ఆలోచనా ఇదే
- మోడీ ఆర్ఎస్ఎస్ కార్యాలయ సందర్శనపై సంజయ్ రౌత్



**ముంబై,మార్చి31:** జాతీయ స్థాయిలో నాయకత్వ మార్పు కోసం ఆర్ఎస్ఎస్ ఒత్తిడి తెస్తోందని శివసేన నేత సంజయ్ రౌత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే ఆర్ఎస్ఎస్ ఇప్పుడు తదుపరి బీజేపీ జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకోవడంలో బీజీగా ఉంది.. ప్రధాని మోడీ పర్యటన సంఘ్ పరివార్‌లోని విస్తృత రాజకీయ ఎత్తుగడలో భాగమని సంజయ్ రౌత్ ఆరోపించారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీపై నేత సంజయ్ రౌత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇటీవల నాగ్‌పూర్‌లోని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆర్ఎస్ఎస్ కార్యాలయాన్ని సందర్శించడంపై శివసేన యూబీటీ నాయకుడు సంజయ్ రౌత్ సంచలన వ్యాఖ్యలు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన పదవీ విరమణ ప్రణాళికలను ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌కు మోడీ తెలియజేశారని పేర్కొన్నారు. ఇక, ప్రధాని మోడీ వారసుడిని ఆర్ఎస్ఎస్ నిర్ణయిస్తుందని ఆయన తెలిపారు. నాకు తెలిసినంత వరకు గత 1011 సంవత్సరాలలో మోడీ జీ ఎప్పుడూ కూడా ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించలేదు. ఇప్పుడు సందర్శించడం చూస్తుంటే కేవలం వారిసుడి ఎంపిక సందర్భంగానే ఇది జరిగిందన్న అనుమానం కలుగుతోందని అన్నారు. ఇక భవిష్యత్ నాయకుడిని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నిర్ణయిస్తుందని సంజయ్ రౌత్ పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ గురించి నేను అర్థం చేసుకున్న రెండు విషయాలు మీకు తెలియజేస్తున్నాను.. మొదటిది, ఆ సంస్థ దేశ నాయకత్వంలో మార్పును కోరుకుంటుంది.. రెండోది, మోడీ జీ కాలం ముగిసింది.. ఆయనను కూడా మార్పును కోరుకుంటున్నారని చెప్పారు. మోడీ ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించడంలో వేరు పనులేమి ఉంటాయని అన్నారు. గత పదేళ్లలో ఎన్నడూ ఆర్ఎస్ఎస్ కార్యాలయానికి వెళ్లని ప్రధాని ఇప్పుడు వెళ్లడం వెనక ముఖ్యమైన కారణం ఇదే అయి ఉండొచ్చని అన్నారు. ఆయన పదవీవిరమణ చేయాలని యోచిస్తున్నారని.. తన రిటైర్మెంట్ ప్రణాళికల గురించి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌తో చర్చలు జరపడానికే అక్కడికి వెళ్లి ఉంటారని అభిప్రాయం వ్యక్తంచేశారు. ఆర్ఎస్ఎస్ దేశ నాయకత్వంలో మార్పును కోరుకుంటున్నట్లు నేను నమ్ముతున్నాను. వారు ముందుగా తదుపరి భాజపా చీఫ్‌ను ఎన్నుకోవాలనుకుంటున్నారు. ఆ సంస్థ నియమాల ప్రకారం మోదీ కూడా రాజకీయాలకు రిటైర్మెంట్ ప్రకటించాలని అనుకుంటున్నారని.. అందుకే ఆయన మోహన్ భాగవత్‌ను కలిసి రిటైర్మెంట్ పత్రాన్ని సమర్పించడానికి వెళ్లి ఉంటారని సంజయ్ రౌత్ అనుమానాలు వ్యక్తం చేశారు. అయితే మోదీ రాజకీయ వారసుడు మహారాష్ట్ర నుంచే వస్తాడని బలంగా నమ్ముతున్నానని కూడా సంజయ్ రౌత్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ రిటైర్మెంట్‌పై సంజయ్‌రౌత్ చేసిన వ్యాఖ్యలను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ కొట్టిపడేశారు. మోదీ నాయకత్వంలో తాము ఇంకా చాలా ఏళ్లు పని చేస్తామని అన్నారు. 2029లోనూ ఆయన ప్రధానిగా సేవలందిస్తారని పేర్కొన్నారు. సమర్థవంతమైన నాయకుడు తమను నడిపిస్తున్నప్పుడు వారసుడి కోసం వెతకాల్సిన అవసరం ఏముంటుందని ప్రశ్నించారు. 11 ఏళ్ల క్రితం ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ప్రధాని మోదీ తొలిసారిగా ఆదివారం నాగ్‌పూర్‌లోని సంఘ్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. తొలుత డా.హెడ్గేవార్ స్మృతి మందిరానికి వెళ్లిన ప్రధాని.. సంస్థ వ్యవస్థాపకుడు డా.కేశవ్ బలిరామ్ హెడ్గేవార్, రెండో సర్‌సంఘ్‌చాలక్ ఎంఎస్ గోల్వాల్కర్‌లకు నివాళులు అర్పించారు. అనంతరం స్మృతిభవన్‌లో ఆరెస్సెస్ పదాధికారులతో భేటీ అయి వారితో గ్రూప్‌ఫొటో దిగారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌ను దేశ అజరామర సంస్కృతి, ఆధునికీకరణ వటవృక్షంగా అభివర్ణించారు. కాగా దేశ ప్రధానులు ఆర్ఎస్ఎస్ కార్యాలయాన్ని అధికారికంగా సందర్శించడం ఇది రెండోసారి. 2000 సంవత్సరంలో వాజ్‌పేయి మూడోసారి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు దీనిని సందర్శించారు. అయితే అప్పట్లో ఎలాంటి విమర్శలు రాలేదు. కేవలం మోడీ సందర్శించడంతోనే సంజయ్ రౌత్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. బిజెపితో సంజయ్ రౌత్‌కు ముందునుంచి పొసగడం లేదు. ఇదికూడా గమనించాల్సి ఉంది.

# రంజాన్ మాసంలోనే... దివ్య ఖురాన్ ఆవిర్భావం

- పవిత్ర ఖురాన్ సర్వ మానవ సౌభ్రాత్వాన్ని బోధిస్తుంది
- దానధర్మాలు, జాతీయత, ధార్మికతల కలయిక రమదాన్
- ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి

**ప్రజాస్వరం గజ్వేల్ నియోజవర్గ ప్రతినిధి మార్చి :31** రంజాన్ మాసంలోనే దివ్య ఖురాన్ ఆవిర్భవించగా, జకాత్, జాతీయత, ఆధ్యాత్మికతలను ముస్లింల పవిత్ర గ్రంథమైన ఖురాన్ బోధిస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి పేర్కొన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈద్గా మైదాన్ లో ముస్లిం సోదరులు, మున్సిపల్ వైస్ చైర్మన్ జకియోద్దీన్ తదితరులకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ తో కలిసి ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాస దీక్ష చేపట్టి భక్తిశ్రద్ధలతో అల్లాకు కృతజ్ఞతగా ప్రార్థనలు నిర్వహించి దానధర్మాలు చేయడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. ఏ మతానికి చెందిన పండగలైనా మానవహితాన్ని బోధించే సందేశం దాగి ఉంటుందని, పవిత్ర ఖురాన్ కుడా అదే బోధిస్తుందని స్పష్టం చేశారు. ముస్లింలు జరుపుకునే పండుగలో రంజాన్ కు అత్యంత ప్రాధాన్యత ఉండగా, దేవుడి పట్ల కృతజ్ఞతగా ఉండి జకాత్ (దానధర్మాలు) చేయాలని ఖురాన్ బోధిస్తుందని చెప్పారు. ముఖ్యంగా మానవీయ విలువలు, పరోపకారం, సహనం, త్యాగం, కరుణ, దయార్థ హృదయం, సమానత్వం, సామరస్య వాతావరణం, జాతీయతలను రంజాన్ మాసం సూచిస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని సోదర భావంతో ప్రతి ఒక్కరు మెలగాలని ఆయన ఆకాంక్షించారు.



# నాడు ఆహార భద్రత చట్టం అమలు

- నేడు పేదలకు సన్న బియ్యం పంపిణీ కాంగ్రెస్ ప్రభుత్వ ఘనతే...!
- ఉగాది, రంజాన్ పండగ పర్వదినాన అమలు
- పేదలు, మైనార్టీల సంక్షేమానికి కట్టుబడిన కాంగ్రెస్

**ప్రజాస్వరం గజ్వేల్ నియోజవర్గ ప్రతినిధి మార్చి :31** యూపీఏ చైర్ పర్సన్ సోనియాగాంధీ ఆదేశాలతో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆహార భద్రతా చట్టం అమలు చేయగా, నేడు రాష్ట్రంలోని పేదలందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. రంజాన్ పర్వదిన సందర్భంగా మైనార్టీలకు పండగ శుభాకాంక్షలు తెలుపుతూ, సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అట్టడుగు నిలిచిన పేదలు, మైనార్టీల అభ్యున్నతికి కట్టుబడి పని చేస్తున్నట్లు స్పష్టం చేశారు. కాగా రాష్ట్ర చరిత్రలో సన్న బియ్యం పంపిణీ పథకం చారిత్రాత్మకం కానుండగా, దివంగత ప్రధాని ఇందిరాగాంధీ వెట్టి చాకిరి విముక్తి పథకం, ఆలాగే కూడు, గుడ్డ, ఇల్లు లక్ష్యంతో పేదలను తీర్చిదిద్దుతునట్లు స్పష్టం చేశారు. సామాజిక న్యాయం లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి అన్ని వర్గాల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తూ పథకాలను నేరుగా వర్తింపజేస్తున్నట్లు చెప్పారు. అయితే గత కెసిఆర్ ప్రభుత్వ హయాంలో బియ్యం మాఫియా పెట్రేగిపోగా, సాక్షాత్తు అప్పటి ఎమ్మెల్యేలు సీఎంఆర్ ధాన్యం, బియ్యాన్ని పక్కదారి పట్టించినట్లు ఆరోపించారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం రూ 10665 కోట్లు వెచ్చిస్తూ 2 కోట్ల 85 లక్షల మంది పేద లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరుస్తున్నట్లు స్పష్టం చేశారు. అంతేకాకుండా అర్హులైన పేదలందరికీ తెల్ల రేషన్ కార్డులు త్వరలోనే అందించనున్న కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల్లో పేదలకు గూడు కల్పించే లక్ష్యంతో రూ 5 లక్షల వ్యయంతో ఇండ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. 6 గ్యారంటీల అమలు, పంట రుణమాఫీ వంటి సాహసోపేత నిర్ణయాలతో సీఎం రేవంత్ రెడ్డి అన్ని వర్గాల మన్ననలు పొందుతుండగా, ఉగాది, రంజాన్ పర్వదిన సందర్భంగా పేదలందరికీ సన్నబియ్యం పంపిణీ చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం అవుతుందని అన్నారు. అలాగే గజ్వేల్ పట్టణంలో మజీద్ కమిటీ చైర్మన్ మతీన్ మరియు ఇతర మైనార్టీ పెద్దలు, ముస్లిం సోదరులకు ఆయన రంజాన్ పండగ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.



# కొమురవెల్లి శ్రీ మల్లికార్జున దేవస్థానంలో ఉగాది పంచాంగ శ్రవణం

**ప్రజాస్వరం కొమురవెల్లి 31 మార్చి** మల్లన్న ఆలయంలో నిర్వహించినటువంటి పంచాంగ శ్రవణంలో శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో సమృద్ధిగా వర్షాలు పాడి పంటలు సుభిక్షంగా ఉంటాయని భూమంతా పచ్చదనంతో వర్ధిల్లుతుందని స్వామివారికి 11 ఆదాయము భక్తుల సౌకర్యార్థం ఆలయంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులకై 11 వ్యయము గ్రామానికి 14 ఆదాయం 2 వ్యయం ఉంటాయని ఈ సంవత్సరం మొత్తం విద్యా వైద్య భవన నిర్మాణ రంగాల వారికి చాలా లాభ సూచకంగా ఉందని పశుసంపదలో కూడా చాలా అభివృద్ధి ఉంటుందని గత సంవత్సరంలో అందరూ అనుభవించిన బాధలన్నీ కూడా ఈ సంవత్సరం తీరుస్తుందన్నారు




# శ్రీరామ నవమి ఉత్సవాలకు హరీష్ రావు కి ఆహ్వానం...

**సిద్దిపేట ప్రజాస్వరం :**సిద్దిపేట నియోజకవర్గం లో, పట్టణం లోని శ్రీరామ నవమి సందర్భంగా రావాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు గారికి ఆలయ నిర్వాహకులు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా నంగునూర్ మండలం నర్మేట గ్రామంలోని రామాలయం, సిద్దిపేట పట్టణం లోని హరిప్రియ నగర్ లోని శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయ, శ్రీ పంచముఖ హనుమాన్ దేవాలయం, గణేష్ నగర్ శ్రీ ప్రసనంజనేయ స్వామి దేవాలయం, శ్రీ రామ రాజు రావి చెట్టు హనుమాన్ దేవాలయం లో జరిగే ఉత్సవాలకు రావాలని ఆలయ నిర్వహకులు హరీష్ రావు గారికి పత్రిక అందజేసి ఆహ్వానం పలికారు..



# ట్యాంకర్ తో పొలానికి నీరు.. పంటను కాపాడుకోవడానికి రైతుల పాట్లు..



**జనగామ ప్రజాస్వరం :** చుట్టుపక్క గ్రామాల్లో నీరు లేక రోజురోజుకు భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. ఇప్పటికే వేలాది బోర్లు ఎండిపోవడంతో తీర ప్రాంతాల్లో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. ముందు ముందు ఇంకా ఎండాకాలం ఉండడంతో తాగునీటికి సైతం ప్రజల తిప్పలు పడే పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి పరిస్థితుల్లో భూగర్భ జలాలు రోజు రోజుకు పడిపోవడంతో వరి పంట ఎండిపోకుండా కాపాడుకోవడానికి సోమవారం రఘునాథపల్లి మండలం మేకలగట్టు గ్రామంలో రైతు రజినీకాంత్ ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించి పోస్తున్నాడు. రజినీకాంత్ రెండు ఎకరాల్లో వరి పంట వేశాడు. ఒక బోరు, ఒక బావి, ఉండగా బాయి ఎండి పోయింది. బోరు నుంచి ధారగా నీరు వస్తోంది. భూగర్భ జలాలు అడుగంటడంతో ఎకరం, వదిలి పెట్టి మరో ఎకరానికి ట్యాంకర్ ద్వారా నీరు పెట్టి పంటను కాపాడుకుంటున్నాడు. ఇందుకు నీరు అందించినప్పుడు రూ.మూడు నుండి ఐదు వేల వరకు ఖర్చు చేస్తున్నాడు. మూడు రోజులకు ఒకసారి ఐదు ట్యాంకర్ల ద్వారా నీరు పెడుతున్నట్లు రైతు తెలిపారు.









- నేడు గ్రామాల్లో నల్లాల వద్ద మహిళల పడిగాపులు
- గతంలో కేసీఆర్ ప్రభుత్వం గ్రామాలకు తాగునీటి ఎద్దడి లేకుండా మిషన్ భగీరథ నీటిని సరాఫరా చేసింది.
- గ్రామాల మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# నాడు మిషన్ భగీరథ ద్వారా పుష్కలంగా నీరు..

**ప్రజాస్వరం ప్రతినిధి:**

రామాయంపేట రూరల్, : వేసవి కాలం ప్రారంభంలోనే గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. చాలా వరకు గ్రామాల్లో సరిపడే నీరు అందక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ నీరు కూడా సన్నటిదారలా రావడంతో గంటల తరబడి బిందెలు పట్టుకొని నల్లాల వద్దే ఉంటున్నారు.గతంలో కేసీఆర్ ప్రభుత్వం గ్రామాలకు తాగునీటి ఎద్దడి లేకుండా మిషన్ భగీరథ నీటిని సరాఫరా చేసింది. ఒక వేళ ఈ సరఫరాలో ఏదైనా అంతరాయం కలిగితే గ్రామ పంచాయితీ బోర్ల ద్వారా గ్రామాల్లోని ట్యాంకు, బస్తీల్లోని మినీట్యాంకులకు నీటిని అందింది నీటిని సమస్య లేకుండా చేసింది. కానీ నేడు అందుకు భిన్నంగా పరిస్థితులు మారాయి. గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సక్రమంగా రాకపోవడం, వచ్చిన సన్నటి దారలాగా వచ్చి పట్టుమని పదిబిందెలు కూడా రాని దుస్థితి నెలకొందని గ్రామాల మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయంలో పంచాయితీ ఆధ్వర్యంలో ఉన్న బోర్ల నుండి అయినా నీటిని అందించాలని కోరితే అవి రిపేరులో ఉన్నాయని కొందరు, కాలిపోయాయని మరికొందరు చెప్తుండగా.. కనీసం ట్యాంకర్లను పెట్టడానికి కూడా పంచాయితీల్లో డబ్బులు లేవని కొందరు అధికారులు చెప్తున్నారని మహిళలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో అధికారులను కూడా తాము తప్పు పట్టడం లేదని పాలకులు ఉంటే వారినే అడిగే వాళ్లమని మహిళలు అంటున్నారు.ఉదయం పూట పిల్లలు పాఠశాలలకు వెళ్లడానికి వంట చేద్దామంటే నీరు రాక వంట చేసుకోవడానికి చాలా సమయం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి అప్పటి సమయానికి సర్దుకుపోవాల్సి వస్తుందన్నారు. కేసీఆర్ పాలనలో ఎప్పుడు ఇలాంటి పరిస్థితి రాలేదని.. ఆయన విలువ ఇప్పుడు తెలుస్తుందని కేసీఆర్ ఉంటే నీటి సమస్య పరిష్కార మార్గం తక్షణమే ఉండేదని నిర్భయంగా అంటున్నారు.







## మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి దంపతులకు వివాహ శుభాకాంక్షలు తెలియజేసిన నాయకులు

**కౌడిపల్లి ప్రజాస్వరం ప్రతినిధి:** నర్సాపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి సుజాత దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మదన్ రెడ్డికి నియోజకవర్గంలో ప్రజలు శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం మదన్ రెడ్డి వివాహ వార్షికోత్సవ పురస్కరించుకొని యూత్ కాంగ్రెస్ జిల్లా.సీనియర్ నాయకులు దొంతుల దుర్గయ్య ఆధ్వర్యంలో అభిమానులు, నాయకులు భారీగా తరలివెల్లి హైదరాబాద్ మదన్ రెడ్డి నివాసంలో శుభాకాంక్షలు తెలియజేశారు. దంపతులను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు .మదన్ రెడ్డి దంపతులు ఆయురారోగ్యాలతో మరిన్ని ప్రజాసేవ కార్యక్రమాలు చేపట్టాలని వారు ఆకాంక్షించారు . ఈ కార్యక్రమంలో మాజీ ఆత్మ కమిటీ సభ్యులు రాజు, మండల సీనియర్ , నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



## రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

**ప్రజాస్వరం గజ్వేల్ నియోజవర్గ ప్రతినిధి మార్చి :31** గజ్వేల్ మున్సిపల్ వైస్ చైర్మన్ జకియోద్దీన్ కు సోమవారం రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సిద్దిపేట జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పవిత్ర రంజాన్ పండగ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్త, మాజీ జెడ్పిటిసి డాక్టర్ మల్లేశం తదితరులు జకియోద్దీన్ కు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.



## మత సామరస్యానికి భక్తి భావానికి ప్రతీక రంజాన్

### కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గాదగొని చక్రధర్ గౌడ్

**సిద్దిపేట ప్రజాస్వరం :**మత సామరస్యానికి భక్తి భావానికి ప్రతీక రంజాన్ అని ఫార్మర్స్ ఫస్ట్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గాదగొని చక్రధర్ గౌడ్ అన్నారు. రంజాన్ పర్వదినం పురస్కరించుకొని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యాక్షుడు మహ్మద్ సోయల్ నివాసంకు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చక్రధర్ మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. రంజాన్ పండగ మతాలకు అతీతంగా సోదర భావంతో నిర్వహించుకునే పండుగ అన్నారు. సిద్దిపేట ప్రాంతం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో బొల్గం శ్రీకాంత్, గ్యాదరి శివ, గోనెపల్లి శివప్రసాద్, మిట్టపల్లి రంజిత్, పర్మరాములు, మంగళారపు సాయి, అనంద్, నాగరాజు, భరత్ తదితరులు పాల్గొన్నారు.



## వక్ఫ్ సవరణ బిల్లు కు వ్యతిరేకంగా ముస్లింల నిరసన.

**కొండాపూర్,మార్చి 31 (ప్రజాస్వరం ):**వక్ఫ్ ఏమైన్ మెంట్ బిల్లు పేరుతో కేంద్ర ప్రభుత్వం కక్షపూరితంగా అన్యాయంగా పార్లమెంట్ లో వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లు తీసుకువచ్చి జెపిసి కమిటీ పేరుతో డ్రామాలాడుతోందని ముస్లిం మత పెద్దలు ఆరోపించారు.సోమవారం రంజాన్ పండగ సందర్భంగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ పిలుపు మేరకు కొండాపూర్ మండలంలోని అనంత సాగర్ లోని సెంటర్ లో ఈద్గాలో ప్రార్థనల అనంతరం నల్ల రిబ్బన్ లు ధరించి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లు పేరుతో వక్ఫ్ ఆస్తులను కాజేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఇది హేయమైన చర్య అన్నారు.కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని ముస్లింలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజి జడ్ పి కో ఆప్షన్ సభ్యుడు అమీనొద్దీన్,ముస్లిం పెద్దలు వహీద్,జలీల్,జాకీర్,అజీమ్ పాష,మోహీన్,మహా మూద్, చాంద్ పాషా,ఆయాజ్ తదితరులు పాల్గొన్నారు.




## ట్యాంకర్ తో పొలానికి నీరు..
## పంటను కాపాడుకోవడానికి రైతుల పాట్లు..

**జనగామ మార్చి 31(ప్రజాస్వరం):** చుట్టుపక్క గ్రామాల్లో నీరు లేక రోజురోజుకు భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. ఇప్పటికే వేలాది బోర్లు ఎండిపోవడంతో తీర ప్రాంతాల్లో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. ముందు ముందు ఇంకా ఎండాకాలం ఉండడంతో తాగునీటికి సైతం ప్రజల తిప్పలు పడే పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి పరిస్థితుల్లో భూగర్భ జలాలు రోజు రోజుకు పడిపోవడంతో వరి పంట ఎండిపోకుండా కాపాడుకోవడానికి సోమవారం రఘునాథపల్లి మండలం మేకలగట్టు గ్రామంలో రైతు రజినీకాంత్ ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించి పోస్తున్నాడు. రజినీకాంత్ రెండు ఎకరాల్లో వరి పంట వేశాడు. ఒక బోరు, ఒక బావి, ఉండగా బాయి ఎండి పోయింది. బోరు నుంచి ధారగా నీరు వస్తోంది. భూగర్భ జలాలు అడుగంటడంతో ఎకరం, వదిలి పెట్టి మరో ఎకరానికి ట్యాంకర్ ద్వారా నీరు పెట్టి పంటను కాపాడుకుంటున్నాడు. ఇందుకు నీరు అందించినప్పుడు రూ.మూడు నుండి ఐదు వేల వరకు ఖర్చు చేస్తున్నాడు. మూడు రోజులకు ఒకసారి ఐదు ట్యాంకర్ల ద్వారా నీరు పెడుతున్నట్లు రైతు తెలిపారు.




## హెచ్సీయూ భూములపై మరోసారి ఆలోచించాలి : ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



**హైదరాబాద్ మార్చి 31(ప్రజాస్వరం):**రాష్ట్రంలో ప్రస్తుతం హెచ్సీయూ భూముల వివాదం తీవ్ర రాజకీయ చర్చకు దారి తీసింది. ప్రతిపక్షాలు అన్నీ ఆ భూములను వర్సిటీకే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి. ఆ భూముల్లో వైవిధ్యమైన జీవ సంపద ఉందని, ఆ అటవీ భూములను తొలగిస్తే పర్యావరణానికి ఎంతో ముప్పు వాటిల్లుతుందని పేర్కొంటున్నాయి. తాజాగా ఈ వివాదంపై బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి స్పందించారు. హెచ్సీయూ భూములపై ప్రభుత్వం మరోసారి ఆలోచించాలని సూచించారు. 50 ఏళ్లుగా ఆ భూముల్లో చెట్లు, కొండలు ఉన్నాయని.. వాటిలో వివిధ రకాల పక్షులు, జంతువులు నివసిస్తున్నాయని అన్నారు. ఇపుడు రాష్ట్ర ఆర్థికపరిస్థితి బాగోలేదని వర్సిటీ భూములు అమ్ముతారా అని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రకృతి, విద్యార్థులకు నష్టం కలిగించొద్దని హితవు పలికారు. గతంలో ఎన్నో ప్రభుత్వ భూములను తెగమ్మిన బీఆర్ఎస్ నేతలు ఇపుడు మాత్రం ధర్నా చేయడం విడ్డూరం ఉందని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఇక ఈ భూముల వివాదంపై టీజీఐఐసీ కీలక ప్రకటన చేసింది. ఆ 400 ఎకరాల భూమి ప్రభుత్వానిదే అని తేల్చి చెప్పింది. దీనిపై వర్సిటీకి ఎలాంటి హక్కులు లేవని తెలిపింది. అయితే టీజీఐఐసీ చేసిన ప్రకటనను హెచ్సీయూ ఖండించింది. ఈ భూములపై వర్సిటీలో ఎలాంటి సర్వే చేయలేదని పేర్కొంది. ఆ భూములు వర్సిటీవేనని హెచ్సీయూ అధికారులు అన్నారు.

## రంజాన్ సర్వమత సౌభ్రాతృత్వానికి ప్రతీక : చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

**శంకర్ పల్లి మార్చి 31(ప్రజాస్వరం ):**పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య సోమవారం శంకర్ పల్లి పట్టణంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ముస్లీం సోదరులతో ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని, వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “పవిత్ర రంజాన్ మాసంలో నిష్ఠతో పాటించే ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలు సామరస్యాన్ని, శాంతిని, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తాయి. ఈ పండుగ ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలను నింపాలి” అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ముస్లీం సోదరులు, మరియు ప్రముఖులు పాల్గొన్నారు. శంకర్‌పల్లి ఈద్గా వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో మతసామరస్యానికి ప్రతీకగా హిందూ, ముస్లీం సంఘాల ప్రతినిధులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ, “తెలంగాణ రాష్ట్రం సర్వమత సౌభ్రాతృత్వానికి నిలయం. అన్ని మతాలను సమానంగా గౌరవించడం, భిన్నత్వంలో ఏకత్వాన్ని పాటించడం మన సంస్కృతిలో అంతర్భాగం” అని అన్నారు.



అనంతరం స్థానిక ముస్లీం పెద్దలను కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే, ముస్లీం సోదరులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. శంకర్‌పల్లి ముస్లీం సమాజం ఎమ్మెల్యే కాలే యాదయ్యకు కృతజ్ఞతలు తెలియజేసి, ప్రభుత్వ సహకారం తమకు నిరంతరం ఉండాలని కోరారు. సమగ్ర అభివృద్ధే తన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు ముగిసిన అనంతరం మైనారిటీ సోదరులతో కలిసి సామూహిక భోజనం నిర్వహించారు. చేవెళ్ల నియోజకవర్గ ప్రజలందరికీ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, స్నేహం, ఐక్యత, శాంతి రాజ్యమేలాలని ఆకాంక్షిస్తూ శంకర్‌పల్లి ఈద్గా వద్ద ముస్లీం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థన చేసిన ఎమ్మెల్యే కాలే యాదయ్యను స్థానికులు అభినందించారు. తెలంగాణ రాష్ట్రం భవిష్యత్తులోనూ మత సామరస్యానికి నిదర్శనంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

# జాతీయ అవార్డు గ్రహీత ఉత్తమ ఆదర్శ రైతు కు సన్మానం చేసిన అనకాపల్లి ఎం.పీ

**అనకాపల్లి,మార్చి 31(ప్రజాస్వరం):**అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం కండెవరం గ్రామానికి చెందిన అప్పలనాయుడు కి ఇటీవలే ఢిల్లీలో జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ వారు అందించిన 'ఐ సి ఏ ఆర్ ఇన్నోవేటివ్ ఫార్మర్' అవార్డు పొందిన సందర్భంగా అనకాపల్లి ఎం.పీ క్యాంపు కార్యాలయంలో వెలమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం రమేష్ దుశ్శలవతో సత్కరించి వారికి పుష్పగుచ్ఛం మరియు ఫలాలు అందజేసి ఘనంగా సన్మానం చేశారు.ఈ సందర్భంగా సీ.ఎం రమేష్ మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా వినూత్న పద్ధతిలో వ్యవసాయం చేస్తూ రైతులకు సాగులో మెలకువలు చెబుతున్న అప్పలనాయుడు నేటి యువతరానికి ఎంతో ఆదర్శం అని వారి యొక్క సేవలు నేటి యువత వినియోగించుకోవాలని పేర్కొన్నారు.మన అనకాపల్లి జిల్లా నుంచి ఉత్తమ ఆదర్శ రైతుగా గుర్తించినందుకుగాను ఐసీఏఆర్ బృందానికి మరియు శాస్త్రవేత్తలకు ఆచార్యులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.అనంతరం వెలమా ఫౌండేషన్ ప్రముఖులు ఐ సి ఏ ఆర్ ఇన్నోవేటివ్ ఫార్మర్ పురస్కారానికి కెవికె శాస్త్రవేత్తలు సిఫార్సు చేసినందుకుగాను సంఘం తరపున కృతజ్ఞతలు తెలియజేస్తూ ఢిల్లీలో అందించిన అవార్డును సి.ఎం రమేష్ చేతుల మీదుగా తీసుకోవాలని అప్పలనాయుడు కోరికను మన్నించి సంఘం సభ్యులను ఆహ్వానించి అప్పలనాయుడు ని ఘనంగా సన్మానించిన పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ కి సత్కరించి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.కార్యక్రమం లో బిజెపి రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్, గాదె శ్రీనివాస్ వెలమ ఫౌండేషన్ చైర్మన్ ఎం.వి. ఆర్ మూర్తి ,కార్యదర్శి సత్యనారాయణ రాజు , గౌరవ అధ్యక్షులు విజయ నాయుడు ,వై సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన కాడిగారి రాజశేఖర్ రెడ్డి

**శంకర్ పల్లి మార్చి 31(ప్రజాస్వరం ):** పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా మండలంలోని మహాలింగాపురం గ్రామంలో ముస్లిం సోదరులతో కలిసి వేడుకల్లో పాల్గొన్న పీఎసిఎస్ డైరెక్టర్ కాడిగారి రాజశేఖర్ రెడ్డి, అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం తన సొంత గ్రామమైన మహాలింగాపురంలో ముస్లిం సోదరులతో ఆప్యాయంగా కలిసిన ఆయన, వారితో ముచ్చటిస్తూ రంజాన్ పర్వదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రంజాన్ మాసం ముస్లిం సోదరుల జీవితంలో అత్యంత పవిత్రమైనదని, దీని ద్వారా ధర్మ నిష్ఠ, సామరస్య భావనలు మరింత పెరుగుతాయని అన్నారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ పవిత్ర మాసంలో ఉపవాస దీక్ష పాటించిన ప్రతి ముస్లిం సోదరునికి తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని కాడిగారి రాజశేఖర్ రెడ్డి తెలిపారు.



## మేడిశెట్టి వారి పాలెం గ్రామం లో సారా బట్టిలపై దాడులు నిర్మించిన ఎక్సైజ్ అధికారులు

**ఏలూరు జిల్లా,మార్చి 31 (ప్రజాస్వరం ):**ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఏలూరు జిల్లా శ్రీలత మేడం మరియు డిస్టిక్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ ఏలూరు జిల్లా ఏ ఆవులయ్య ఆదేశాల ప్రకారం సోమవారం చింతలపూడి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోగల చింతలపూడి మండలం మేడిశెట్టి వారి పాలెం లో గోదా దుర్గా అనే మహిళను 02 లీటర్ల నాటు సారాయితో అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేయడమైనది అని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సి ఐ పి అశోక్ తెలిపారు.ఈ దాడులలో ప్రొహిబిషన్ & ఎక్సైజ్ ఎస్సైలు ఆర్ వి ఎల్ నరసింహారావు మరియు జె. జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.



## ముస్లింలపై పూల వర్షం కురిపించిన హిందువులు.. 'దటీజ్ ఇండియా' అంటున్న నెటిజన్లు

**ప్రజాస్వరం వెబ్‌డెస్క్:** భిన్న మతాలు, భిన్న సంస్కృతులు కలయికే భారతదేశం. ఎన్ని మతాలుగా, ఎన్ని కులాలుగా విడిపోయి ఉన్నా.. ఓ సమయం వచ్చినప్పుడు అందరం ఒకటే అని చాటిచెబుతారు. ముఖ్యంగా అయ్యప్ప మాలలు ధరించిన వారికి ముస్లింలు అన్నప్రసాదాలు పెట్టడం, రంజాన్ వేళ ముస్లింలకు హిందువులు ఇఫ్తార్ విందులు ఇవ్వడం తరచుగా చూస్తుంటారు. తాజాగా.. ఇలాంటి రంజాన్ పండుగ వేళ అందరినీ ఆకట్టుకున్నది. రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో మత సామరస్యం వెల్లివిరిసింది. జైపూర్ ఈద్గా వద్ద రంజాన్ రోజున మజీద్‌లో ప్రార్థనలు చేసిన వస్తున్న ముస్లింలపై హిందువులు పూల వర్షం కురిపించారు. కిలోమీటర్ల మేర పుష్పవర్షం కురిపిస్తూ గ్రాండ్ వెల్‌కమ్ చెప్పారు. ఈ వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇవి గమనించిన నెటిజన్లు.. "భిన్నత్వంలో ఏకత్వం"ని భారత్ మరోసారి చాటిచెప్పింది. దటీజ్ ఇండియా అంటూ నెటిజన్లు అంటున్నారు.





## పుష్కరానికి కలుసుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

**వలిగొండ,మార్చి 31 (ప్రజాస్వరం):**వలిగొండ మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 20122013 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న ఏ సెక్షన్ విద్యార్థులు సోమవారం పట్టణంలోని శివశక్తి ఫంక్షన్ హాల్ లో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాటి ప్రధానోపాధ్యాయులు మోటే రాములు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రమశిక్షణను పాటిస్తూ కష్టపడి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోదించాలని,శారీరక శ్రమను వ్యాయామాన్ని చేస్తూ ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని కోరారు.ఉపాధ్యాయులు విద్యార్థులు వారి మధ్య ఉన్న అనుబంధాలను, మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. ఉపాధ్యాయులు రంగయ్య, విజయేందర్ రెడ్డి,నరసింహ, రవికుమార్,ప్రభాకర్ రెడ్డి, అశోక్ రెడ్డి,కవిత, విద్యుతులత,అనురాధ, విద్యార్థిని విద్యార్థులు గర్దాసు మనోహర్,బోనగిరి ప్రవీణ్,మోటే వెంకటేష్,కే మౌనిక,డి మౌనిక,నవనీత తదితరులు పాల్గొన్నారు.

## సైదాపూర్ లో కాంగ్రెస్ నేత హాజీ పటేల్ ఆధ్వర్యంలో ఈద్ మిలాప్.

**సోదరా భవానికి ప్రతీక రంజాన్.**

**కొండాపూర్,మార్చి 31 (ప్రజాస్వరం ):**రంజాన్ పండగ సోదరా భవానికి ప్రతిక అని కొండాపూర్ సిఐ వెంకటేష్ అన్నారు.సోమవారం కొండాపూర్ మండలం పరిధిలోని సైదాపూర్ లో కాంగ్రెస్ నేత హాజీ పటేల్ ఆధ్వర్యంలో రంజాన్ పండుగను పురస్కరించుకొని ఈద్ మిలాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు చెప్పారు.ఈ కార్యక్రమం కొండాపూర్ ఎస్సై భరత్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ నేతలు సునీల్,ఫర్ వేజ్, ప్ర



## రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**వలిగొండ,మార్చి 31(ప్రజాస్వరం):**భువనగిరి జిల్లా,వలిగొండ మండల కేంద్రంలో రంజాన్ వేడుకల్లో ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.అల్లా దువాతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని అన్నారు.ముస్లింల సంక్షేమానికి రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. కుల మతాలకతీతంగా భక్తిశ్రద్ధలతో ప్రతి ఒక్కరు ఉండాలని సూచించారు.



## రావుల పల్లి లో ఘనంగా రంజాన్ వేడుకలు..

**శంకర్ పల్లి మార్చి 31(ప్రజాస్వరం):**మండలంలోని అన్ని గ్రామాలలో రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా నిర్వహించారు. నెల రోజులుగా ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు సోమవారం రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. మండల వ్యాప్తంగా ఎక్కడ చూసినా సందడి వాతావరణం కనిపించింది. నూతన వస్త్రాలను ధరించి మసీదులో ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. రంజాన్ మాసమంతా కఠిన నియమాలతో ఉపవాస దీక్ష పాటించిన ముస్లిం సోదరులు ఆదివారం నెలవంక కనిపించడంతో సోమవారం రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రంజాన్ మాసపు ఉపవాస దీక్షల ప్రార్థనలకు చివరి అంకమే ఈద్ ఉల్‌ఫితార్ అని వారు అన్నారు. సోదర భావం, సమానత్వం, సమైక్యత ప్రతి ఒక్కరిలో ఉండాలని వారు అన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## ఇస్సపల్లిలో ఘనంగా రంజాన్ వేడుకలలు



**నిజామాబాద్, మార్చి 31(ప్రజాస్వరం ):**ఆర్మూర్ ఇస్సపల్లి గ్రామంలో ఉత్తర రాష్ట్ర తెలంగాణ పార్టీ ఆర్మూర్ మైనార్టీ అధ్యక్షులు మెహబూబ్ సోమవారం రంజాన్ సందర్భంగా వారి స్వగృహంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు.ముఖ్య అతిథిగా ఉత్తర రాష్ట్ర తెలంగాణ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జోతి హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.అలాగే మా పార్టీ కులాలకు మతాలకు అతీతం కాకుండా అందరూ సమానులని అన్నారు. మైనార్టీ అధ్యక్షులు మెహబూబ్ మాట్లాడుతూ రంజాన్ వేడుకలకు హాజరైన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎర్ర రాకేష్ ఉపాధ్యక్షులు లలిత ఆర్మూర్ బీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్ శ్రీనివాస్ గౌడ్ అలాగే తదితరులు పాల్గొన్నారు.

# ఆఫ్ లైన్ లో రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు స్వీకరించాలి

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి  మల్లు భట్టి విక్రమార్క.
- జిల్లా కలెక్టర్ ను ప్రత్యేకంగా అభినందించిన డిప్యూటీ సీఎం.
- రాజీవ్ యువ వికాసం పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన భట్టి.



**పెద్దపల్లి,మార్చి31(ప్రజాస్వరం):**ఆఫ్ లైన్ లో కూడా రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు స్వీకరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు.సోమవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క  జిల్లాల కలెక్టర్లతో రాజీవ్ యువ వికాసం పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిఎస్ శాంతి కుమారితో కలిసి సమీక్ష నిర్వహించారు.ఈ మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకం క్రింద సర్వర్ పని చేయని పక్షంలో ఆఫ్ లైన్ దరఖాస్తులు స్వీకరించి ఎంపిడిఓ,తహసిల్దార్ కార్యాలయంలో ఆన్ లైన్ దరఖాస్తు నమోదు చేయాలని డిప్యూటీ సీఎం తెలిపారు.ఈ పథకం మానిటరింగ్ కోసం ప్రత్యేకంగా ఒక ఐఏఎస్ అధికారిని ప్రత్యేకంగా నియమించాలని డిప్యూటీ సీఎం సీఎస్ కు సూచించారు.ఎస్సి ,ఎస్టీ,బీసి,మైనార్టీ దరఖాస్తులు పరిశీలించాలని అన్నారు.వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ 2018 లో ఎస్సి,ఎస్టి కార్పోరేషన్ క్రింద దరఖాస్తు చేసుకున్న కొందరికి యూనిట్ మంజూరైనప్పటికి సబ్సిడి విడుదల కాలేదని తెలిపారు.గతంలో దరఖాస్తు చేసుకొని సబ్సిడీ మంజూరు కాని దరఖాస్తులను తిరస్కరించి వారు నేడు మరో సారి దరఖాస్తు చేసుకునే విధంగా అవకాశం కల్పించామని అన్నారు.పెద్దపల్లి జిల్లాలో పాత దరఖాస్తుల స్వీకరణకు చేపట్టిన చర్యలను డిప్యూటీ సీఎం కలెక్టర్ కోయ శ్రీ హర్ష ను ప్రత్యేకంగా  అభినందించారు.ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేష్,జిల్లా బీసి అభివృద్ధి అధికారి రంగా రెడ్డి,ఎస్సీ కార్పొరేషన్ రవి కుమార్,వినోద్ కుమార్,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అహలే హదీస్ ఈద్గాలో రంజాన్ వేడుకలు.

**ఏలూరు జిల్లా,మార్చి 31 (ప్రజాస్వరం):**పవిత్ర రంజాన్ పండుగను ఏలూరులో ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.ఏలూరు పట్టణంలోని అల్లూరి సీతారామరాజు స్టేడియం  పెన్షన్ లైన్ మదీనా మస్జిద్ అహలే హదీస్ ఈద్గాలవద్దకు సోమవారం ఉదయం7.30కే వెళ్లారు.నెల రోజులు  ఉపవాస  దీక్షలుచేపట్టిన  ముస్లింలు, నెలవంక దర్శనంతో పవిత్ర రంజాన్ పండుగను వాడవాడలా జరుపుకుంటున్నారు. పట్టణంలోని ముస్లింలు తంగేలముడి,గన్ బజార్, పెన్షన్ మహల్లా,కత్తెపు వీధి, నుంచి వేలాదిమంది అల్లాహు అక్బర్,అల్లాహు అక్బర్ లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హమ్ద్" అంటూ పెన్షన్ లైన్  అహలే హదీస్ ఈద్గాకు చేరుకుని ఆలింగనం చేసుకుని ప్రార్థనలు చేశారు. అనంతరం వక్ఫ్ సవరణ బిల్లుని ముస్లిం సమాజం వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఈద్గా నమాజులో పాల్గొన్న ముస్లింలు తమ చేతికి నల్ల రిబ్బిల్లు కట్టుకొని నిరసన వ్యక్తం చేస్తూ నమాజులో పాల్గొన్నారు.



## ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కు టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) కృతజ్ఞతలు

**జర్నలిస్టుల రైల్వే పాస్ అంశాన్ని పార్లమెంట్లో లేవనెత్తినందుకు ధన్యవాదాలు తెలిపిన ఖమ్మం జిల్లా కమిటీ**

**ఖమ్మం,మార్చి 31(ప్రజాస్వరం):** గత కొన్ని సంవత్సరాలుగా రైల్వే పాస్ లేక జర్నలిస్టులు ఇబ్బంది పడుతున్నారని, జర్నలిస్టుల రైల్వే పాస్ పై రాజ్యసభలో ప్రస్తావించి రైల్వే పాస్ ఇప్పించే లాగా కృషి చేయాలని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ను ఖమ్మం జిల్లా టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) కమిటీ చేసిన విజ్ఞప్తి మేరకు వద్దిరాజు రవిచంద్ర రాజ్యసభలో జర్నలిస్టుల రైల్వే పాస్ పై ప్రస్తావించి జర్నలిస్టు పక్షాన గొంతు ఎత్తినందుకు ఖమ్మం జిల్లా టీజేఎఫ్ కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.2018 నుండి రైల్వే పాస్ లోని 50% రాయితీని రద్దు చేసిందని, తిరిగి కొనసాగించే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేసింది.ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ చిర్రా రవి, జాతీయ కౌన్సిల్ సభ్యులు వెన్నబోయిన సాంబశివరావు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి రజినీకాంత్ జిల్లా ఉపాధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి టీఎస్ చక్రవర్తి తదితర జిల్లా కమిటీ సభ్యులు ప్రెస్ క్లబ్ కమిటీ, నగర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## స్వాతంత్ర సమరయోధురాలు పల్లె బోయిన పుల్లమ్మ దశ

**దినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న మల్లిబాబుయాదవ్.**

**ఖమ్మం,మార్చి 31 (ప్రజాస్వరం):**

ఖమ్మం జిల్లా యాదవ సంఘం నాయకులు, మాజీ ఎంపీపీ పల్లెబోయిన శంకర్, పల్లెబోయిన చంద్రం మాతృమూర్తి,ప్రముఖ స్వాతంత్ర సమరయోధురాలు పల్లె బోయిన పుల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో స్వగ్రామ మైన రఘునాథపాలెం మండల పరిధిలోని బూడిదంపాడు గ్రామంలో మరణించడంతో  మంగళవారం  నాడు జరిగిన  వారి దశ దిన కర్మ కార్యక్రమాలలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా అధ్యక్షులు  చిలకల వెంకట నరసయ్య, జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్ పాల్గొని శ్రద్ధాంజలి ఘటించి వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి, మాతృమూర్తి చనిపోవడంతో  వారి కుమారుడైన పల్లెబోయిన చంద్రం ను ఓదార్చి  కుటుంబానికి మనోధైర్యం కల్పించారు.ఖమ్మం జిల్లాలో యాదవుల అభివృద్ధికి పాటుపడుతున్న చంద్రం  మాతృమూర్తి చనిపోవడం  చాలా తీరనిలోటని విచారం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర కార్పొరేటర్లు పల్లెబోయిన భారతి,మలీదు వెంకటేశ్వర్లు, మలీదు నాగేశ్వరరావు  చేతుల నాగేశ్వరరావు,కాకనబోయిన మధు, వాకధాని పుల్లారావు  పల్లె బోయిన రవి అల్లిక అంజయ్య, పల్లె బోయిన పుల్లారావు,వాకదాని కోటేశ్వరరావు మొరిమేకల కోటయ్య, బండారు ప్రభాకర్,దేవరాజ్  శీలం పుల్లయ్య భూక్యా నాగేంద్రబాబు పాటిబండ్ల ప్రసాదు బాదావత్ నాగరాజు, చిర్ర  శంకర్  కాకనబోయిన  బోయిన సంగయ్య, పల్లెబోయిన చంద్రం తదితరులు పాల్గొన్నారు.



## తమ సమస్యలను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ కు విన్నవించుకున్న పారిశుద్ధ్య కార్మికులు

**ఏలూరు జిల్లా,మార్చి 31 (ప్రజాస్వరం):**కైకలూరు మండలం కైకలూరు ట్రావెల్స్ బంగ్లా వద్ద శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ ని కలిసి ఇటీవల వారు ఎదురుకున్న బాధలను కైకలూరు పంచాయితీ పారిశుధ్య సిబ్బంది విన్నవించుకున్నారు.ఈ సందర్భంగా కామినేని  మాట్లాడుతు మీ ఉద్యోగాలు మీకే ఉంటాయి మీ మీద వివక్ష తగదని మీ విషయం సర్పంచ్ తో,ఉన్నతాధికారులతో మాట్లాడి మీకు న్యాయం చేస్తానని రాబోయే రోజుల్లో కూడా మీకు ఎలాంటి కష్టం వచ్చిన నాకు తెలియజేయండి అని నేను మీ అందరికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## సాయి కుమార్ హంతకులను కఠినంగా శిక్షించాలి.







- పరువు హత్య కాదు..కుట్రపూరిత హత్య.
- కేసు విచారణకి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలి.
- మృతుని కుటుంబానికి రూ.కోటి ఎక్స్ గ్రేషియో చెల్లించాలి.
- పౌరహక్కుల,ప్రజా సంఘాల డిమాండ్.

**పెద్దపల్లి,మార్చి31(ప్రజాస్వరం):**

పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ముప్పిరితోటలో మార్చి 27న ప్రేమ పేరుతో హత్య కాబడ్డ పూరెళ్ళ సాయి కుమార్ ది పరువు హత్య కాదని,కుట్రపూరితంగా చేసిన హత్యేనని పౌరహక్కుల,విప్లవ రచయితల సంఘం,తెలంగాణ ప్రజా ఫ్రంట్, దళిత లిబరేషన్ ఫ్రంట్ నాయకులు ఆరోపించారు.హత్య జరిగిన ప్రదేశాన్ని సందర్శించిన అనంతరం మృతుని కుటుంబ సభ్యులతో వివరాలు సేకరించారు.అనంతరం పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాధన కుమారస్వామి,దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్వాడీ సుదర్శన్,తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ గుమ్మడి కొమురయ్య మాట్లాడుతూ ముప్పిరితోట గౌడ కులంకు చెందిన పూరెళ్ల పరుశరాములుజ్యోత్స్నల కొడుకు సాయి కుమార్ పదవ తరగతి పూర్తి చేసి డ్రైవర్ గా పనిచేస్తున్నాడని,అదే గ్రామం ముదిరాజ్ కులానికి చెందిన ముత్యం సమతసదయ్యల కూతురు గత రెండు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారని నిజనిర్ధారణ తేలిందని వివరించారు.ఈ ప్రేమ వ్యవహారం ఇరు కుటుంబాల సభ్యులకు,గ్రామస్తులకు ముందే తెలుసున్నారు.అమ్మాయి చదువు పూర్తయిన తర్వాత పెళ్లిచేసుకుందాం అని అనుకుంటున్న క్రమంలో ప్రేమ వ్యవహారం, పెళ్లి ఇష్టం లేని అమ్మాయి తల్లిదండ్రులు ముత్యం సదయ్య,సమత,రంగాపూర్ గ్రామానికి చెందిన అమ్మాయి మేనమామ సిద్ద సారయ్య,అదే గ్రామానికి చెందిన చీకటి మల్లయ్య అతని కొడుకు చీకటి హరీష్ల ప్రోధ్భలంతో హత్యకు కుట్రాపన్నారని పేర్కొన్నారు.స్నేహితులతో కలిసి తన పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటున్న సాయి కుమార్ ను విచక్షణ రహితంగా గొడ్డలితో నరికి చంపారని తమ విచారణలో తేలిందన్నారు.గతంలో రెండు సార్లు సాయి కుమార్ పై దాడి జరిగినా పోలీసులు స్పందించలేదని,హరీష్ కు తన కూతరును ఇచ్చి పెళ్లి జరిపించాలని కుట్రతో సాయి కుమార్ ను చంపారని ఇది ముమ్మాటికీ పరువు హత్య కాదన్నారు.ప్రేమ పేరుతో జరిగిన ఈ హత్యను పౌరహక్కుల సంఘం,విప్లవ రచయితల సంఘం, తెలంగాణ ప్రజా ఫ్రంట్,దళిత లిబరేషన్ ఫ్రంట్ లుగా ప్రజా సంఘాలుగా ఖండిస్తున్నామని అన్నారు.ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అమ్మాయి తల్లిదండ్రులు ముత్యం సదయ్య - సమత,మేనమామ సిద్ధ సారయ్య, చీకటి మల్లయ్య,హరీష్ లలో ముగ్గురిని మాత్రమే అరెస్ట్ చేసారని కీలక వ్యక్తులు చీకటి మల్లయ్య,హరీష్ లను ఇంత వరకు అరెస్ట్ చేయలేదని వారు ఆరోపించారు.సమాజంలో ప్రేమ,కులం,మతం పేరుతో జరిగే పరువు హత్యలు,దాడుల నివారణకు ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజలు,యువత, విద్యార్థులలో మార్పు తీసుకురావడం కోసం గ్రామ,మండల,జిల్లా స్థాయి వరకు ప్రజలు,ఉన్నతాధికారులు పోలీసులు, ప్రజాసంఘాలతో ఒక కమిటీ ఏర్పాటు చేసి ఈ సమస్యలపై ప్రజలలో విస్తృత ప్రచారం కల్పించాలని డిమాండ్ చేశారు. అధికార,ప్రతి పక్ష పార్టీలు ఈ ఘటనలకు భాద్యత వహించాలన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం ముప్పిరితోట ఘటనపై సమగ్ర విచారణ జరిపించి హంతకులను కఠినంగా శిక్షించాలని,మిగితా ఇద్దరినీ వెంటనే అరెస్ట్ చేయాలన్నారు.కేసు విచారణ కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ఏర్పాటు చేయాలని,సాయి కుమార్ కుటుంబానికి ఒక కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు శ్రీపతి రాజగోపాల్,విప్లవ రచయితల సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య, పౌరహక్కుల సంఘం నాయకులు బొంకూరి లక్ష్మణ్,ఎన్.సత్యనారాయణ,పుట్ట రాజన్న,రెడ్డిరాజుల సంపత్ పాల్గొన్నారు.

## సీఎం చేతుల మీదుగా విక్రమ్ గౌడ్‌కు 'ఉగాది పురస్కారం'

**విశాఖపట్నం, మార్చి31(ప్రజాస్వరం):**సాంస్కృతిక రంగంలో వాస్తవికతకు గీటురాయివంటి 'ద డ్యాన్స్ ఇండియా' ఆంగ్ల మాస పత్రిక నిర్వహణకు గాను  ఆ పత్రిక ప్రధాన సంపాదకుడు, విశాఖపట్నానికి చెందిన బహుముఖ ప్రజ్ఞాశాలి బత్తిన రంగ విక్రమ్ కుమార్ (గౌడ్) ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక  'ఉగాది పురస్కారం' తో సత్కరించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున భాషా సాంస్కృతికశాఖ, దేవాదాయ ధర్మాదాయ శాఖ సంయుక్తంగా ఆదివారం ఉదయం విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళా క్షేత్రంలో అంగరంగ వైభవంగా ఏర్పాటు చేసిన విశ్వావసునామ సంవత్సర ఉగాది 2025 వేడుకల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్నందుకున్నారు. గత 25 వసంతాలుగా తాను నెలకొల్పిన నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడెమీ ఆధ్వర్యంలో దేశం నలుచెరగులా పలు జాతీయ, అంతర్జాతీయ నృత్యోత్సవాల నిర్వహణలో ఆయన ఓ విశిష్ఠ దీపశిఖగా వెలుగొందుతున్నారు. వైశాఖి నృత్యోత్సవ్, భారత్ నృత్యోత్సవ్,నటరాజ్ నృత్యోత్సవం,సత్యభామ నృత్యోత్సవం,జతీస్ వంటి విభిన్న నృత్యోత్సవాలకు రూపకల్పన చేసి,దేనికదే తన ప్రత్యేకతలు చాటుకునేవిధంగా తీర్చిదిద్దే నృత్యదార్శనికుడాయన.దేశ  విదేశాలలోని  ప్రసిద్ధ  యవనికలపై  భారతీయ జెండాను  రెపరెపలాడించడంతోపాటు  ద  డ్యాన్స్  ఇండియా పత్రిక ద్వారా సాంస్కృతి రంగానికి నిరుపమానమైన ప్రామాణిక డాక్యుమెంటరీలు రూపొందించడంలో ఆయన ఖ్యాతిగడించారు. దేశ, విదేశాలలో అనేక ప్రతిష్ఠత్మక వేదికలపై నాట్యరంగానికి వెన్నదన్నుగా నిలుస్తూ ఎన్ని ఒడుదుడుకులు, ఒత్తిళ్లెదురైనా మొక్కవోని దీక్షతో కళారంగానికి ఆయన చేసే సేవలకు ఈ పురస్కారం ఒక ప్రోత్సాహం,మరింత బాధ్యతాయుతంగా ముందుకు సాగడానికి ఊతం ఇస్తుందని విక్రమ్ పేర్కొన్నారు.



## సిఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా బీఎస్ రెడ్డికి 'కళా రత్న'

**విశాఖపట్నం, మార్చి31(ప్రజాస్వరం):**విశాఖపట్నానికి చెందిన ప్రపంచ ప్రఖ్యాత భారతీయ మహేంద్రజాలికుడు (ఇల్యూజనిస్ట్) డాక్టర్ బి.ఎస్. రెడ్డిని ఆంధ్రప్రదేశ్  ప్రభుత్వం  ప్రతిష్ఠాత్మక  'కళారత్న'  బిరుదుతో  సత్కరించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున భాషా సాంస్కృతికశాఖ, దేవాదాయ ధర్మాదాయ శాఖ సంయుక్తంగా  విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళా క్షేత్రంలో అంగరంగ వైభవంగా ఏర్పాటు చేసిన విశ్వావసునామ సంవత్సర ఉగాది 2025  వేడుకల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులమీదుగా దుశ్శాలువతో సత్కరించి,హంస అవార్డుతోపాటు కళారత్న బిరుదు ప్రదానం చేశారు. మునుపెన్నడూ లేనివిధంగా ఇంద్రజాల రంగంలో గత 35 సంవత్సరములుగా దేశ, విదేశాలలో అనేక ప్రతిష్ఠత్మక వేదికలపై తన ఇంద్రజాల ప్రదర్శనలిచ్చి,  నిరుపమానమైన ప్రతిభాపాఠవాలను కనబరిచి, ఎన్నో అద్భుత విజయాలు సాధించిన రెడ్డి తన సొంత గడ్డపై ఈ గౌరవాన్ని అందుకోవడం ఓ విశేషం.గత మూడున్నర దశాబ్ధాలుగా తన అవిశ్రాంత కళా ప్రయాణంలో సహకరించి,తోడ్పాటు అందించిన,అభినందించి, ప్రోత్సహించిన, అవకాశాలు కల్పించిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు.



## మొగిలి పాక గ్రామంలో ఘనంగా రంజాన్ వేడుకలు

**వలిగొండ,మార్చి 31(ప్రజాస్వరం):**భువనగిరి జిల్లా,వలిగొండ మండల పరిధిలోని మొగిలిపాక గ్రామంలో ముస్లిం సోదరులు ఒకరినొకరు అలాయి బలాయి తీసుకుంటూ పవిత్ర రంజాన్ మాసంలో నెలరోజుల కఠిన ఉపవాసాల అనంతరం రంజాన్ పండుగ జరుపుకుంటున్న మన ముస్లిం సోదరీ సోదరీమణులు అందరికీ చాంద్ ముబారక్ తో పాటు రంజాన్ ఈద్ ముబారక్ తెలుపుకున్నారు.ఈ రంజాన్ ఈద్ను ప్రతి ఒక్కరు సుఖసంతోషాలతో చేసుకోవాలని,అల్లా ఆశీస్సులు మనందరికి ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సయ్యద్ భాష, మౌలానా,సయ్యద్, ఇమామ్,కరీం సద్దాం,ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.



## మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ

**నారాయణపురం,మార్చి 31 (ప్రజాస్వరం):**రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లీం సోదరులు నారాయణపురం మండల కేంద్రంలోని ఈద్గాలో సామూహిక ప్రార్థనలు చేసి రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా మహబూబియ మస్జిద్ కమిటీ అధ్యక్షుడు హాశం ఫారుకి  మాట్లాడుతూ రంజాన్ పండుగ  మత సామరస్యానికి  ప్రతికగా నిలుస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు అక్బర్ అలీ,గౌస్ ఉద్దీన్ ఖురేషి,నయీమ్ షరీఫ్, అష్రాఫ్,ఇమ్రాన్,నజీముద్దీన్ కురేషి,యూసఫ్ ఖాన్,ఇసా మునుగోడు నియోజకవర్గ మైనార్టీ నాయకులు ఎండి రహీం షరీఫ్,మాజీ వార్డ్ నెంబర్ అడ్డు ఎండి జాంగిర్ ఖాన్,హర్షద్ తదితరులు పాల్గొన్నారు.






# ఆర్య2 రీరిలీజ్..

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, పంచాదబొమ్మ కాజల్ నటించిన సినిమా 'ఆర్య-2'. ఈ సినిమా బాక్సాఫీస్‌ను బద్దలు కొట్టింది. ఇందులో బన్నీ, కాజల్ మధ్య కెమెస్ట్రీగానీ, పాటలు గానీ, నటీనటుల యాక్టింగ్ అన్నీ కూడా ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో కీలకంగా నిలిచాయి. కానీ సినిమా మాత్రం ఆశించిన ఫలితాన్ని అందుకోలేదు. సినిమా బాగుందని ప్రేక్షకులు అన్నారు కానీ.. హిట్ చేయడనికి మాత్రం వెనకడుగు వేశారు. 'ఆర్య' సిరీస్ మంచి ఫ్యాన్ బేస్ ఉంది. బన్నీ కెరీర్‌ను టర్న్ చేసిని సినిమా 'ఆర్య'. ఆ సినిమాకు సీక్వెల్‌గా వచ్చిన మూవీ 'ఆర్య-2'. ఆదిత్య ఆర్ట్స్ పతాకంపై బీవీఎస్ ఎన్ ప్రసాద్ సమర్పణలో ఆదిత్యబాబు నిర్మించిన ఈ మూవీ ప్రేక్షకులను ఆ స్థాయిలో ఆకట్టుకోలేదు. కానీ క్లాసికల్ మూవీగా నిలిచింది.

అయితే ఈ సినిమాను ఇప్పుడు రీ రిలీజ్ చేయబోతున్నారు. ఏప్రిల్ 8న అల్లు అర్జున్ పుట్టిన రోజు ఉంది. ఆయన బర్త్ డే సందర్భంగా ఏప్రిల్ 5న ఈ సినిమాను రీ రిలీజ్ చేయనున్నట్టు ప్రకటించారు. ఈ సినిమాను హైదరాబాద్ లోని కొన్ని ఏరియాల్లో మాత్రమే రిలీజ్ చేస్తున్నట్టు సమాచారం. ఇప్పుడు టాలీవుడ్ లో రీ రిలీజ్ ల ట్రెండ్ నడుస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే బన్నీకి సంబంధించిన రెండు సినిమాలు రీరిలీజ్ చేశారు. ఆ నడుమ రీ రిలీజ్ లకు కొత్త డిమాండ్ తగ్గింది. కానీ ఫ్యాన్స్ కు కొన్ని సినిమాలు ఫేవరెట్ ఉంటాయి. ఆర్య-2 మ్యూజికల్ గా పెద్ద హిట్ అయింది. కాబట్టి ఈ సినిమాను కూడా ఆదరించే అవకాశాలు ఉన్నాయని మేకర్స్ భావిస్తున్నారంట.

# ఎమోషనల్ పోస్ట్



తన నటనతో విశ్వరూపం చూపించి, ఏకంగా నేషనల్ అవార్డు సొంతం చేసుకున్న మహానటి కీర్తి సురేష్, తొలిసారి తన మనసు ముక్కలైంది అంటూ ఆవేదన వ్యక్తం చేసింది. ఇటీవల మయన్మార్‌లో జరిగిన భూకంపం గురించి పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కీర్తి సురేష్ కూడా ఆవేదన వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. "మయన్మార్, థాయిలాండ్‌లో భీకర పరిస్థితులు ఏర్పడ్డాయి. ముఖ్యంగా అక్కడ భూకంపం రావడంతో భారీగా ప్రాణ నష్టం తో పాటు ఆస్తి నష్టం కూడా జరిగింది. ఈ విషయాన్ని, అక్కడ ప్రజల గురించి తలుచుకుంటూ ఉంటే నా గుండె ముక్కలు అయినంత బాధగా ఉంది. గుండె తరుక్కుపోతోంది. అక్కడి పరిస్థితులు త్వరగా కుదుటపడాలి. అక్కడ ప్రజలు త్వరగా కోలుకోవాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నాను" అంటూ ఒక ఎమోషనల్ పోస్ట్ పెట్టింది కీర్తి సురేష్.

# ప్రభాస్ పిఆర్‌ఓపై కేసు



హీరో ప్రభాస్ పీఆర్వో తనకు ఫోన్ చేసి బెదిరిస్తున్నాడని యూట్యూబర్ ఒకరు హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మార్చి 4న ప్రభాస్‌కు సర్జరీ జరిగిందని విజయ సాధు వీడియో పోస్ట్ చేశారు. ఒక యూట్యూబర్ 'డార్లింగ్ ఇన్ డేంజర్' అనే ఈ వీడియో ఈ నెలలో ప్రభాస్ కు పెద్ద సర్జరీ జరిగిందని చెబుతూ పోస్ట్ చేసిన తర్వాత సోషల్ మీడియాలో వైరల్ అయింది. ప్రభాస్ పీఆర్వో తనకు ఫోన్ చేసి బెదిరిస్తున్నాడని యూట్యూబర్ ఒకరు హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే హీరో పీఆర్వో అని చెప్పకుంటున్న సురేష్ అనే వ్యక్తి యూట్యూబర్‌కు ఫోన్ చేసి వెంటనే వీడియోలను డిలీట్ చేయాలని డిమాండ్ చేశాడు. అయితే, యూట్యూబర్ వీడియోలను తొలగించలేదు. దీంతో ఆ లింక్ ను ప్రభాస్ అభిమానులకు షేర్ చేసాడు.ఈ క్రమంలో అభిమానులు కూడా వార్నింగ్ ఇవ్వడం మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో యూట్యూబర్ విజయ్ పోలీసులను ఆశ్రయించాడు. కాగా, ప్రభాస్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందంటూ పోస్ట్ చేసిన వీడియోలపై వివాదం నెలకొంది. ఈ సమస్యకు కారణమైన సురేష్ కొండిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు.



# ఫ్యాన్స్‌కు సారీ చెప్పిన మోహన్ లాల్

మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ హీరోగా వచ్చిన తాజా చిత్రం ఎల్2: ఎంపురాన్ చిక్కుల్లో పడింది. తీవ్ర వివాదాల్లో చిక్కుకుంది. సుకుమార్ డైరెక్ట్ చేసిన ఈ సినిమాలో గుజరాత్ అల్లర్లకు సంబంధించి కొన్ని సన్నివేశాలు ఉండటమే ఇందుకు కారణం. సినిమాపై పలువురు అభ్యంతరాలు వెల్లిబుచ్చుతూ చిత్ర మేకర్స్ పై మండిపడుతూ సోషల్ మీడియాలో బాయ్‌కాట్ ఎల్2 అంటూ ట్రెండ్ చేస్తున్నారు. ఈ వివాదంలో కేంద్ర ప్రభుత్వం కూడా జోక్యం చేసుకోవడంతో సెన్సారు బోర్డు ఎల్2 సినిమాలో 17 సీన్స్ మార్పులు చేయాలని మేకర్స్ కు సూచించింది. ఈ విషయంలో తాజాగా మోహన్ లాల్ స్పందిస్తూ, ఆడియన్స్ కు క్షమాపణలు చెప్తూ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేశారు. "ఎల్2: ఎంపురాన్ సినిమాలో వచ్చిన కొన్ని సామాజిక, రాజకీయ అంశాలు ఎంతో మందిని మనోవేదనకు గురిచేయడంతో పాటూ చాలా మంది మనసుల్ని నొప్పించాయని, ఆర్టిస్టుగా నా సినిమాలు రాజకీయ ఉద్యమాలు, భావజాలం, ఓ వర్గం పట్ల ద్వేషాన్ని కలిగించేలా ఉండకుండా చూసుకోవాల్సిన బాధ్యత నాకుంది. మా సినిమా మిమ్మల్ని బాధపెట్టినందుకు చింతిస్తూ, ఎంపురాన్ టీమ్ మొత్తం తరపున క్షమాపణలు చెప్తున్నా. ఆడియన్స్ ను బాధ పెట్టే సన్నివేశాలను సినిమా నుంచి తొలగించాలని చిత్ర యూనిట్ మొత్తం కలిసి నిర్ణయం తీసుకున్నాం. గత 40 ఏళ్లుగా ఆడియన్స్‌లో ఒకడిగా నా సినీ జర్నీని కొనసాగించా. ఆడియన్స్ ప్రేమ, విశ్వాసమే నా బలమని, ప్రేక్షకుల ప్రేమ కంటే మోహన్ లాల్‌కు ఏదీ ఎక్కువ కాదు" అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336, EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999